క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి అంకితం

గండేపల్లి: పార్టీ ప్రతిష్టతకు అంకితభావంతో అందరిని కలుపుకుని ఐక్యతగా పనిచేస్తామని జిల్లా కమిటీకి ఎన్నికైన వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా గండేపల్లి మండలం ఉప్పలపాడుకు చెందిన రామకుర్తి రామచంద్రమూర్తి, సెక్రటరీ యాక్టివిటీ సభ్యుడిగా రామేశంపేటకు చెందిన గోరింట అబ్బులును పార్టీ అధిష్టానం నియమించినట్లు సోమవారం వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తమపై నమ్మకంతో పదవులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. జగ్గంపేట నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జ్ తోట నరసింహం నాయకత్వంలో తాము పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

వృద్ధులకు ఆహారం పంపిణీ



ప్రత్తిపాడులోని వృద్ధులకు ఆహారం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకురాలు బెహరా లక్ష్మీప్రసన్న

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు గ్రామానికి చెందిన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తొలితరం నాయకుడు, బెహరా లచ్చారావు మాష్టారు వర్ధంతిని సోమవారం కుటుంబ సభ్యులు నిర్వహించారు. జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, జడ్పీటీసీ సభ్యురాలు రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శ్రీ శారదా వయోవృద్ధ నిలయంలోని వృద్ధులకు, పాదచారులకు, గ్రామంలోని పేదలకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకురాలు బెహరా లక్ష్మీ ప్రసన్న, శ్రీసత్యసాయి సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యంగిర హోమం

అన్నవరం: రత్నగిరి వనదేవతగా పూజలందుకుంటున్న శ్రీ వనదుర్గ అమ్మవారికి వైశాఖ అమావాశ్య పర్వదినం సందర్భంగా నేడు ప్రత్యంగిర హోమం నిర్వహించనున్నారు. నెల రోజుల తరువాత అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్నారు. ప్రతీ నెల పౌర్ణమి, అమావాశ్య పర్వదినాలలో వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 12న వైశాఖ పౌర్ణమి అయినప్పటికీ సత్యదేవుని కల్యాణ మహోత్సవాల సాకుతో అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించకపోవడం వివాదస్పదమైన విషయం తెలిసిందే. కాగా, మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి 11.గంటల వరకు ప్రత్యంగిర హోమం నిర్వహించి అనంతరం పూర్ణాహుతి నిర్వహిస్తారు. ఇందులో పాల్గొనే భక్తులు రూ.750 టిక్కెట్ కొనుగోలు చేసి పాల్గోనాలని అధికారులు తెలిపారు.

సాంస్కృతిక కళలను కాపాడుకోవాలి




కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభంను, గిరిబాబును కలిసిన అన్నమయ్య కళాక్షేత్రం సభ్యులు

కిర్లంపూడి: సాంస్కృతిక కళలను, కళాకారులను కాపాడుకోవలసిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర వైఎస్సార్ సీపీ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం అన్నారు. కాకినాడ జిల్లా అన్నమయ్య కళాక్షేత్రం అధ్యక్షుడు సాన సూకరాజు కళాక్షేత్రం సభ్యులతో సోమవారం కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలోని ఆయనతో పాటు, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను కలిసిన వారిలో దిడ్డి సునీత, రాంబాబు, పైలా అప్పలనాయుడు, దాసరి సూర్యనారాయణరావు, కడారి శ్రీనివాస్, అత్తి వెంకట సుబ్బారావు తదితరులు ఉన్నారు.

రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

గండేపల్లి: తాళ్లూరు రామలింగేశ్వర స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మెళుకువలతో తీర్చిదిద్దాలి



వేసవి విజ్ఞాన తరగతులను నిర్వహిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: జిల్లా గ్రంథాలయం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ అధికారి సన్యాసి అన్నారు. ధర్మవరం శాఖ గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు చదవడం, రాయడంతో పాటు చారిత్రక కథలు, ఆరోగ్య సూత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జూన్ 6వ వరకు కొనసాగే వేసవి విజ్ఞాన తరగతులకు విద్యార్థులను పంపించి పలు కళలపై పట్టు సాధించేందుకు సహకరించాలని తల్లిదండ్రులను గ్రంథాలయ అధికారి కోరారు.

కాజ్‌వే నిర్మాణం పూర్తయ్యేనా

- ఏలేరు ఉధృతికి కుంగిపోయిన కాజ్‌వే (వంతెన)
- రాకపోకలు నిలవడంతో ప్రజలు నరకయాతన



ఏలేరుకాలువలో కూలిపోయిన వంతెన

ఏలేశ్వరం: కూటమి నేతల వాగ్దానాలు నీటిమూటలేనని మరోసారి నిరూపించుకున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో తమకు అధికారం కట్టబెడితే వెంటనే వంతెన నిర్మిస్తామని కూటమి నేతలు హామీలు ఇచ్చారు. అధికారం చేపట్టి ఏడాదవుతున్నా ఇప్పటి వరకు వంతెన పునర్నిర్మాణంపై ఒక్క అడుగు ముందుకు పడకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏలేశ్వరం పరిధిలోని ఏలేరు కాలువపై నిర్మించి కాజ్‌వే(వంతెన) కూలిపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వంతెన కూలి ఏళ్లు గడుస్తున్నా నిర్మాణంపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏలేశ్వరం నుంచి జగ్గంపేట గ్రామంలోని పలుగ్రామాల రాకపోకల నిమిత్తం కాజ్‌వే (వంతెన) నిర్మించారు. ఈ కాజ్‌వే మీదుగా ఏలేశ్వరంతో పాటు దాని పరిధిలోని 8వవార్డు(అప్పన్నపాలెం), పలుగ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఏలేరు కాలువ ఉధృతికి నాలుగేళ్ల క్రితం కాజ్‌వే(వంతెన) కుంగిపోయింది.దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఇప్పటివరకు దీని పునర్నిర్మాణానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అప్పటినుంచి కాజ్‌వే మరింతగా కుంగిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీనిపై కేవలం ప్రజలతో పాటు ద్విచక్ర వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. అప్పట్లో నీటి ఉధృతి ఎక్కువ కావడంతో కాలువలో ఉన్న ఫిల్లర్ ఒరిగిపోవడంతో కాజ్‌వే కుంగిపోయింది. గతంలో సుమారు 25 ఏళ్ల క్రితం రూ.99 లక్షల నిధులతో ఏలేశ్వరం నుంచి అప్పన్నపాలెం మీదుగా జగ్గంపేట మండలం ఇర్రిపాక, మామిడాడ, నరేంద్రపట్నం తదితర గ్రామాల రాకపోకలకు ఏలేరుకాలువపై కాజ్‌వే నిర్మించారు. ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్న వంతెన ప్రమాదకరంగా ఉంది. ఏక్షణాన పూర్తిగా కూలిపోతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రజల ఇబ్బందులు

ఏలేరు కాలువపై కాజ్‌వే కుంగిపోవడంతో దీనిపై వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జగ్గంపేట మండలంలోని ఇర్రిపాక, మామిడాడ, నరేంద్రపట్నం గ్రామాలకు దీని మీదుగా ఏలేశ్వరం మూడు కిలోమీటర్లు ఉంటుంది. వంతెన కూలిపోవడంతో ప్రస్తుతం ఏలేశ్వరం రావాలంటే సోమవరం, యర్రవరం మీదుగా తిరిగి సుమారు 15 కిలోమీటర్ల దూరం నుంచి రావల్సి ఉంటుంది. ఏదైనా ఎమర్జన్సీ అయితే ప్రజల పరిస్థితి దారుణంగా ఉంటుందని ప్రయాణికులు వాపోతున్నారు. ముఖ్యంగా ఏలేశ్వరంలోని 8వవార్డు ప్రజలు కాలువకు అవతలి వైపు ఉంటున్నారు. ఉదయం నుంచి రాత్రివరకు నిత్యం ఏలేశ్వరం రావల్సి ఉంటుంది. వీరు వంతెన దెబ్బతినడంతో నానాయాతనలు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నానా ఇబ్బందులు పడుతున్నాం



ఏలేరుకాలువపై వంతెన కూలిపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నాం. కూలిపోయిన వంతెనపై రాకపోకలు సాగించాలంటే పిల్లలు, మహిళలు భయాందోనలకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– రైతు సహదేవుడు, అప్పన్నపాలెం

ఉన్నతాధికారులకు నివేదించాం

ఏలేరు కాలువపై కూలిపోయిన వంతెన నిర్మాణంపై ఉన్నతాధికారులకు అంచనాలు నివేదించాం. అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– మురళీకృష్ణ, ఏఈ పంచాయతీరాజ్ ఏలేశ్వరం

తప్పిన మృత్యువు

- ప్రమాదాలకు నిలయంగా బెండపూడి హైవే
- ఐదు రోజుల తరుణంలో రెండు ప్రమాదాలు



బైకు అదుపుతప్పి గాయాలపాలైన బుజ్జిబాబు

తొండంగి: మండలంలోని బెండపూడి జాతీయ రహదారిపై సోమవారం బైకు టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పిన సంఘనటలో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు, క్షతగాత్రుడు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడకు చెందిన ప్రైవేటు అకౌంటెంట్‌గా చేస్తున్న బుజ్జిబాబు, అతని కుమారుడు మణికంఠ, వరుసకు కుమారుడైన కిరణ్ కలిసి ముగ్గురూ అన్నవరం సత్యదేవుని దర్శనానికి బైకుపై బయలుదేరారు. బెండపూడి జాతీయ రహదారిపైకి చెరుకునే సరికి బైకు వెనుక టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి పడిపోయారు. దీంతో బుజ్జిబాబు తలకు, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. మణికంఠ, కిరణ్‌లకు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన సందర్భంలో వెనుక నుంచి భారీ లారీ వెళ్తుండగా డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి తప్పించడంతో ప్రాణాపాయం తప్పిందని ప్రమాదం చూసిన పోలవరం కెనాల్ వర్క్స్ ప్రతినిధి వెంకటేశ్వరరావు తెలిపారు. గాయాలపాలైన క్షతగాత్రుడిని స్థానికులు సపర్యలు చేసి స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఇదే ప్రదేశంలో నాలుగు రోజుల క్రితం బైకు అదుపుతప్పి మహిళ మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. తరచూ ఈప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల జోన్‌గా ప్రకటించి బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మళ్లీ రేషన్ కష్టాలు మొదలు

- రేషన్ వాహనాలు రద్దు చేయడం దారుణం
- మాజీ మంత్రి తోట నరసింహం



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తోట నరసింహం

జగ్గంపేట: రేషన్ డిపోల వద్దకు వెళ్లి రేషన్ కోసం ప్రజలు పడిగాపులు పడకుండా వుండేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రేషన్ పంపిణీ చేసే వాహనాలను ప్రవేశపెడితే వాటిని కూటమి ప్రభుత్వం రద్దుచేయడానికి ముహర్తం పెట్టిందని దీన్ని వైఎస్సార్ సీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు.రేషన్ వాహనాలను రద్దు చేయడం వల్ల రాష్ట్రంలో వీటి ద్వారా ఉపాధి పొందుతున్న వందలాది మంది యువతకు జీవనోపాధి లేకుండా పోతోందని ఆవేదన వెలిబుచ్చారు. కూటమి ప్రభుత్వం కేవలం జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు ఉనికి లేకుండా చేయాలని వాహనాల రద్దు నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. దీనివల్ల రాబోయే రోజులలో ముసలివారు, ఒంటరిగా వున్న మహిళలు, పేదలు పనులు మానుకుని రేషన్ డిపోల వద్ద పడిగాపులు పడే పరిస్థితి నెలకొంటుదని తెలిపారు.కొంతమందికి రేషన్ ఇచ్చిన తరువాత సరుకు అయిపోయిందని చెపుతారని, దీనితో పలుసార్లు రేషన్ డిపోకు వెళ్లలేని పరిస్థితి కల్పిస్తారని ఇదంతా ఒక కుట్ర అని అన్నారు.కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని,అలాగే రేషన్ వాహనాల సిబ్బందికి అండగా వుండి వారి పక్షాన పోరాటం చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, వైఎస్సార్ సీపీ నేతలు రామకుర్తి జగాల్,మూర్తి, రాజబాబు, జగ్గంపేట పట్టణ అధ్యక్షుడు కాపారపు ప్రసాద్, గోనాడ ప్రసాద్, బూమాడ గణపతి పలువురు నేతలు పాల్గొన్నారు.

జీవోను వెనక్కి తీసుకోవాలి

- రేషన్ వాహనాలు రద్దుపై ఎండీయూ నిరసన
- 19 నెలలు ముందుగానే ఒప్పందం రద్దు



తుని తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందచేస్తోన్న ఆపరేటర్లు

తుని: ప్రజలకు ఇంటింటికి రేషన్ అందించే రేషన్ వాహనాలను ప్రభుత్వం రద్దు చేయడంపై ఎండియూ ఆపరేటర్లు నిరసన గళమెత్తారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఎన్నో కుటుంబాలు జీవనోపాధి కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ఎల్ఐసీ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఎండియూ ఆపరేటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష,, కార్యదర్శులు శ్రీనివాస్, సతీష్ మాట్లాడుతూ..గత ప్రభుత్వ హయంలో తీసుకువచ్చిన ఎండియూ వాహనాలతో ఇంటింటికీ రేషన్ సరుకులు అందిస్తున్నామని, ఇందుకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం వాహనాలను రద్దు చేసే విధంగా ఆలోచన చేయడం సరికాదన్నారు. ప్రజల ముంగిటకు రేషన్ తీసుకువెళ్తున్న ఎండియూ వాహనాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పలు విపత్కర పరిస్థితుల్లో ఎండియూ వాహనాలతో ప్రజలకు పలు సేవలు అందించామన్నారు. వచ్చే ఏడాది డిసెంబరు వరకు ప్రభుత్వానికి, ఎండియూకు మధ్య ఒప్పందం ఉందన్నారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవోను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సింహాచలం, రమణ, లోవరాజు, శ్రీనివాసరావు, సూర్య గోవిందరావు, నాగేంద్ర, స్వామి, రాజు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆదిత్య సిబ్బంది

గండేపల్లి: పోటీ ప్రపంచంలో ముందుకు సాగాలంటే నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ విజ్ఞా పెంపొందించుకోవాలని ఆదిత్య యూనివర్సిటీ ప్రో.చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలియజేశారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ కార్యాలయ సిబ్బందికి నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ తరగతులు సోమవారంతో విజయవంతంగా ముగిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు యూనివర్సిటీ కార్యాలయ సిబ్బందికి విధుల్లో మెళుకువలు నేర్పుతూ, స్కిల్స్ అభివృద్ధి చేసుకోవడానికి వారం రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించినట్టు పేర్కొన్నారు.

ఇంగ్లీష్, తెలుగు టైపింగ్, లెటర్ రైటింగ్, మెయిల్ క్రిడేటింగ్ విద్యార్థులకు, పేరెంట్స్‌కు సరళంగా సౌమ్యంగా మెలుగుతూ వారికి కావాల్సిన సమాచారం అందజేయడం, చక్కటి ఆంగ్ల భాషలో సమాచారం అందించే విధంగా తెలుగు నీలిమ నేతృత్వంలో అభిలాష్, రోజా శ్రావణి సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. ఈ శిక్షణలో ప్రతిభ కనబరిచిన ప్రశంసాపత్రాలు అందజేసిన ఈ కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్లు ఆదిరెడ్డి రమేష్, ఎస్ రమాశ్రీ, డీన్.రామకృష్ణ, ఏవి శర్మ, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల ముసుగులో రవాణా

- క్రిష్టవరంలో 7గురు అరెస్ట్
- షిర్డీకి గంజాయి తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- రూ.13 లక్షలు విలువైన 163 కేజీల గంజాయి స్వాధీనం



కిష్టవరం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్న గంజాయి ముఠా

జగ్గంపేట: గంజాయి రవాణా అడ్డుకునేందుకు పోలీసుల కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుంటే దానికి మించిన ఎత్తుగడలతో గంజాయి రవాణా ఎన్‌హెచ్ 16పై కొనసాగుతోంది. యాత్రికులు, ప్రయాణికుల ముసుగులో రెండు వాహనాలలో షిర్డీకి తరలిస్తున్న 163 కేజీలు గంజాయిని పోలీసుల స్వాధీనం చేసుకుని 7గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2 వాహనాలు, 8 సెల్‌పోన్లు, కొద్దిగా నగదు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.13 లక్షలు వుంటుంది.ఈ సంఘటనకు సంబంధించి పెద్దాపురం డిఎస్పీ శ్రీ హరిరాజు జగ్గంపేటలోని విలేఖర్ల సమావేశంలో అందించిన వివరాలు ఇలా వున్నాయి.

మారు వేశాలతో రవాణా

విశాఖపట్నం, గోపాలపురం గ్రామాలకు చెందిన 4గురు వ్యక్తులు, ఇద్దరు మహిళలు, ఒక మైనర్ బాలుడు ప్రయాణీకులు ముసుగులో ఒడిశా ప్రాంతంలోని చిత్రకొండకు చెందిన ముగ్గురు వ్యక్తుల సహకారంతో బెన్న భూపాలపట్నం గ్రామం నుంచి గంజాయిని 163 కేజీల గంజాయిని 75 ప్యాకెట్లుగా తయారు చేశారు. వీటిని రెండు కార్లులో మహారాష్ట్రలోని షిరిడీకి చెందిన ఒక వ్యక్తికి సరఫరా చేసేందుకు యాత్రికులగాను, ప్రయాణీకులుగాను గెటప్‌లు వేసుకుని బయలుదేరారు. అయితే జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్‌కు వచ్చిన ముందస్తు సమాచారంతో కిర్లంపూడి మండలం క్రిష్టవరం చెక్‌పోస్టు సమీపంలో సోమవారం తనిఖీలు నిర్వహించారు.

మహిళలు సైతం

ఈ తనిఖీలలో రెండు వాహనాలు, 163 కేజీల గంజాయి పట్టుబడ్డాయి. ఈ సంఘటనకు సంభందించి(1) మస్తాన్‌వల్లి 42 విశాఖపట్టణం, (2) ఎస్‌కె షరీఫ్ 32 అల్లిపురం, (3) కె.నాయుడు 29 బలిఘట్నం నర్సీపట్నం, (4) సిహెచ్ సతీష్ 25 నర్సీపట్నం,(5) వివాహిత 35, (6)కుమారి 19 (7)బాలుడు (17) వీరిని అరెస్టు చేసినట్లు, వీరిలో కొంతమంది పాత నేరస్తులు వున్నారని తెలిపారు. వీరిపై కిర్లంపూడి పోలిసు స్టేషన్‌లో కేసు నమోదు చేశామని చెప్పారు.గంజాయి అక్రమ రవాణాను చాకచక్యంగా పట్టుకున్న జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్సై జి.సతీష్, జగ్గంపేట ఎస్సై రఘునాధరావు, సిబ్బంది కృపావరం, గండేపల్లి, జగ్గంపేట పోలిసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఆధార్ తప్పనిసరి

గండేపల్లి: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఆధార్ నమోదుపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్టు సీడీపీఓ ఎం పూర్ణిమ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు 0 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల అనాధ పిల్లలను గుర్తించి వారికి ఆధార్ నమోదు చేయించడంతో ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగానే సోమవారం నీలాద్రిరావుపేట శివారులో 30 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న రాజస్థాన్‌కు చెందిన బొమ్మల తయారిదారుల పిల్లలకు ఆధార్ నమోదుకోసం వివరాలు సేకరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం జూన్ 26 వరకు ఉంటుందన్నారు.

వంతాడ మృతులకు పోస్టుమార్టమ్

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలం వంతాడ గిరిజన తండాలో మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలోని మృతులకు సోమవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పోస్టుమార్టమ్ నిర్వహించారు. వంతాడ మార్గంలో శనివారం ఎదురెదురుగా రెండు క్వారీ లారీలు ఢీకొనడంతో ఇరువురు కూలీలు మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఈ ప్రమాదంలో బీహార్ రాష్ట్రం ఖజారీ జిల్లా తెలిహార్ గ్రామానికి చెందిన క్వారీ కార్మికులు చందన్ కుమార్ (23), ధీరజ్ కుమార్ (21)లు మృతి చెందారు. బీహార్ రాష్ట్రం నుంచి సోమవారం మృతుల బంధువులు రావడంతో పోస్టుమార్టమ్ నిర్వహించి, మృతదేహాలను అప్పగించారు. అనంతరం మతదేహలను అంబులెన్సులో స్వగ్రామాలకు తరలించారు. స్థానిక ఎస్సై లక్ష్మీకాంతం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన వనువులమ్మ జాతర

కపిలేశ్వరపురం: మండలంలోని వాకతిప్ప గ్రామ దేవత వనువులమ్మ జాతర ఉత్సవం సోమవారంతో ముగిసింది. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని భారీ ఎత్తున అమ్మవారి తీర్థాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. జాతరలో గ్రామానికి చెందిన ఆడపడుచులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి



ముద్రగడ గిరిబాబును కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ విజయమే ప్రధమ లక్ష్యంగా పనిచేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గం కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. కిర్లంపూడిలోని పార్టీ రాష్ట్ర అడ్వైజరీ కమిటీ సభ్యులు (పీఏసీ) ముద్రగడ పద్మనాభం నివాసంలో ఆయనతో పాటు, గిరిబాబును రౌతులపూడి వైస్ ఎంపీపీ సూర్రెడ్డి సాయి, గుమ్మరేగుల సర్పంచ్ రాపర్తి రామకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పులి మధు, సుర్ల సత్తిబాబు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరిని గుర్తించి సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అమలుకాని హామీలు ప్రజలను మోసం చేసిందన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

తుని: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా గురువు కె.ఎస్ఎన్.మూర్తి అన్నారు. సోమవారం తుని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కమిషనర్ వెంకట్రావు ఆధ్వర్యంలో యోగా–ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందికి యోగాతో కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. అనంతరం పలు ఆసనాలు వేయించారు. రోజూ ఆసనాలు వేస్తే మానసిక వత్తిడి తగ్గి ప్రశాంతత కలుగుతుందన్నారు. యోగా గురువు మూర్తిని మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, కౌన్సిలర్లు, మున్సిపల్ ఉద్యోగులు సత్కరించారు.

తోట నరసింహం పరామర్శ

కిర్లంపూడి: బూరుగుపూడి సర్పంచ్ ఆళపు రామలక్ష్మి ఇటీవల అనారోగ్యానికి గురై గండేపల్లి ఆదిత్య ఆసుపత్రిలో సర్జరీ చేయించుకున్నారు. ఈ మేరకు విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట కో–ఆర్డినేటర్ తోట నరసింహం సోమవారం ఆసుపత్రికి వెళ్లి రామలక్ష్మిని, భద్రిని పరామర్శించారు. అనంతరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తోట బాబ్జీ, ఉపసర్పంచ్ పాటంశెట్టి కృష్ణమూర్తి, రామకుర్తి రామచంద్రమూర్తి తదితరులు ఉన్నారు.

సారా విక్రయదారులకు రిమాండ్

గండేపల్లి: సారా విక్రయదారులకు పెద్దాపురం కోర్టు రిమాండ్ విధించినట్టు ఎక్సైజ్ సీఐ దుర్గ అర్జునరావు తెలిపారు. ఆయన వివరాల మేరకు గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటకు చెందిన ఓ వ్యక్తి అక్రమంగా సారా విక్రయిస్తుండగా దాడి జరిపి అతని వద్ద నుంచి ఒక లీటర్ సారాను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. జగ్గంపేట మండలం జె.కొత్తూరుకు చెందిన ఓ మహిళ సారా విక్రయిస్తుండగా దాడి జరిపి ఆమె వద్ద నుంచి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని వీరిద్దరిని పెద్దాపురం మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు తెలియజేశారు. అలాగే పాత కేసుల్లో తప్పించుకున్న ఆరుగురు సారా ముద్దాయిలను సోమవారం కోర్టులో హాజరుపరచామన్నారు. సారా తయారు, విక్రయాలు జరిపిన, ప్రోత్సహించిన వారిపై కేసులు నమోదుచేయడం జరుగుతుందన్నారు.

ప్రకృతి సాగే మేలు

శంఖవరం: శంఖవరంలోని ప్రకృతి వ్యవసాయంతో పండించే రింగ్ మోడల్‌ను సోమవారం మండల వ్యవసాయాధికారి పి గాంధీ పరిశీలించారు. ప్రకృతి సాగు ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు అమ్ముతున్న స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ గాంధీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన ఆకు, కూరగాయలు తక్కువ ధరకే కొనుగోలు దారులకు అందజేయడం జరుగుతుందని చెప్పారు. ప్రకృతి సాగు మేలని, వీటిని భుజించడం వల్ల మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. వివిధ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఏఓ స్థానిక రైతులకు వివరించారు.